క్లుప్తంగా

ముస్తాబైన మల్లన్న ఆలయం



విద్యుత్ వెలుగుల్లో మల్లికార్జున ఆలయం

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం లోని శ్రీకేతకి భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం 9వ వార్షికోత్సవానికి ముస్తాము అయిందని యాదవసంఘం సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం మల్లన్న లగ్గం, బండ్లు, బోనాలు, మంగళవారం కొండపోచమ్మ, బంగారమ్మలకు బోనాలు, ఒగ్గు కథలుంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

డంప్‌యార్డు ఎత్తి వేయండి



దీక్షలో పాల్గొన్న జేఏసీ నాయకులు

నర్సాపూర్: డంప్‌యార్డును ఎత్తి వేయాలని చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 21వ రోజుకు చేరాయి. గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్‌లో ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తి వేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రిలే నిరాహారదీక్షల్లో పట్టణంలోని 9వ వార్డుకు చెందిన నాయకులతో పాటు జేఏసీ నాయకులు బాల్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్‌గుప్తా, సుబ్రమణ్యం, సత్యంగౌడ్, సుధాకర్‌రెడ్డి, హబీబ్‌ఖాన్, ఆనంద్‌కుమార్, దేవేందర్‌యాదవ్, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొని తమ నిరసనలు తెలిపారు.

రోడ్డుపై మురుగు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ ప్రధాన రోడ్డుపై మురికినీరు ప్రవాహంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని దొంతి గ్రామం 8వ వార్డులోని ప్రధాన రోడ్డుపై ఉన్న మ్యాన్‌హోల్ నుంచి మురికినీరు పారుతుండడంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. ఇదే దారి గుండా అంగన్‌వాడీకి కేంద్రానికి వెళ్తున్న చిన్నారులు మురికినీటిలో నుంచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. సమస్య పరిష్కరించాలని పలుమార్లు పంచాయతీ సిబ్బందికి చెప్పినా.. పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు. ఈ విషయం గురించి పంచాయతీ కార్యదర్శి శేఖర్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా.. మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రహరీ కూలినా పట్టదా?



కూలిన ప్రహరీ

నర్సాపూర్: పట్టణంలోని విద్యుత్ శాఖ బిల్ కలెక్షన్ సెంటర్ ప్రహరీ కొంతభాగం కూలి చాలా కాలం అవుతున్నా ఆ శాఖ అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. బిల్ కలెక్షన్ సెంటర్ భవనంలోనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి ఉన్న ప్రహరీ కూలడంతో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. ఆ గోడను మళ్లీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మండల ఏఈ రాంమూర్తిని వివరణ కోరగా.. ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించండి

మనోహరాబాద్(తూప్రాన్): రానున్న స్థానిక ఎన్నికల్లో జనాభా ప్రాతిపాదికన 42 శాతం అవకాశం కల్పించాలని బీజేపీ నాయకుడు పురం మహేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. వారికి అన్ని రంగాల్లో రాజకీయ పార్టీల్లో అధిక ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుకు వినియోగించుంటూ వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కాలేజీ భవనం నిర్మాణమెప్పుడో?

- ఇబ్బందుల్లో విద్యార్థులు
- నిర్లక్ష్యంగా అధికారులు



శిథిలావస్థ పాఠశాల భవనంలోనే కొనసాగుతున్న కళాశాల

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్నత పాఠశాలకు చెందిన మూడు గదుల్లో కాలేజీ కొనసాగుతోంది. దీంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి కనబర్చడంలేదు. మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2008లో శివ్వంపేటకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైంది. ఎనిమిదేళ్ల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనంలో కాలేజీ కొనసాగింది. ఆ భవనం సైతం శిథిలావస్థకు చేరడంతో భవనాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అనంతరం అక్కడి నుంచి కొన్నాళ్ల పాటు శివ్వంపేటలోని ఓ అద్దె భవనంలో కాలేజీ నిర్వహించారు. అక్కడి నుంచి 6 ఏళ్లగా హైస్కూల్‌లో కాలేజీ కొనసాగుతోంది.

సరిపడ గదులు లేక..

సరిపడ గదులు లేకపోవడంతో పాటు విద్యార్థుల ప్రాక్టికల్స్ చేసేందుకు సరిపడ సదుపాయాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. శివ్వంపేటతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అనుకూలంగా కళాశాల ఉన్న సొంత భవనం, సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు తూప్రాన్- నర్సాపూర్ పట్టణాల్లోని ప్రైవేట్ కాలేజీలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

నిధులు మంజూరై వెనక్కి..

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంతభవనం నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం రూ. 40లక్షల నిధులు అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. భవన నిర్మాణానికి సంబంధించి భూమి కేటాయింపు జరగకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. పదేళ్ల క్రితం మరోమారు నాబార్డు నుంచి ఆధునిక జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. భూమి కేటాయింపు చేపట్టకపోవడంతో ఆ నిధులు సైతం వెనక్కి వెళ్లాయి.



కాలేజీ నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వభూమి

భూమి కేటాయింపు

చిన్నగొట్టిముక్ల పంచాయతీ తూప్రాన్- నర్సాపూర్ హైవేకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూమి సర్వేనంబరు 114లో ఎకరా 18 గుంటల భూమి కేటాయించి అందుకు సంబంధించి పత్రాలు దేవెన్యూ సిబ్బంది అందజేశారు. ఉన్నతాధికారులు స్పందించి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, భవనం నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లా..



శివ్వంపేటలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశాను. 4 నెలల క్రితం నిధులు మంజూరు కోరుతూ.. సీఎంకు లేఖ అందజేశాం. నిధులు మంజూరైతే.. భవనం నిర్మాణం ప్రారంభిస్తాం.

– సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే



ఎంపీ రఘునందన్‌రావును కలిసిన బీజేపీ నాయకులు

సాగునీటి కోసం ఎంపీకి విన్నపం

కొండపాక(గజ్వేల్): తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులకు సాగునీటిని విడుదల చేయాలని పలువురు బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును కోరారు. మండల అధ్యక్షుడు నీల సత్యం ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ఎంపీని కలిశారు. గతంలో తపాస్‌పల్లి రిజర్వాయర్ డీ4 కాలువ ద్వారా తిమ్మారెడ్డిపల్లి, కొండపాక, దమ్మక్కపల్లి, సిర్సనగండ్ల, జప్తినాచారం, మర్పడ్గ, ఖమ్మంపల్లి గ్రామాల్లోని చెరువులకు నీటిని విడుదల చేసి పంటలు ఎండిపోకుండా కాపాడిన విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పాటు మర్పడ్గ, రాంపల్లి, దుద్దెడ, బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల్లోని చెరువులకు నీరు వెళ్లేందుకు మర్పడ్గ, రాంపల్లి గ్రామాల శివారుల్లో కాలువ తవ్వకం పనులు ఆగిపోయిన విషయాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ తపాస్‌పల్లి రిజార్వయర్ నుంచి కొండపాక మండలంలోని చెరువులు నిండేలా ఇరిగేషన్‌శాఖ అధికారులతో మాట్లాడి పని జరిగేలా చూస్తామన్నారు.



మనోహరాబాద్‌లో డప్పులతో ఆత్మగౌరవ ప్రదర్శన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఏబీసీడీ వర్గీకరణ చేయండి

మనోహరాబాద్(తూప్రాన్): మందకృష్ణమాదిగ పిలుపుతో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వర్గంటి మురళి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో డప్పులతో ఆత్మగౌరవ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ షమిమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో లోపాలను సరిచేయాలన్నారు. మంత్రి వర్గంలో ఇద్దరు మాదిగలకు స్థానం కల్పించాలని వర్గీకరణ మూడు భాగాలుగా కాకుండా ఏబీసీడీ గ్రూపులుగా వర్గీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ అధికార ప్రతినిధి అశోక్, గ్రామాధ్యక్షుడు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్, ఉపాధ్యక్షుడు నర్సింలు, భాస్కర్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

హైవే నిర్మాణంతో ప్రమాదాలకు చెక్



పోచమ్మరాళ్ వద్ద మూలమలుపు తొలగిస్తూ..

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్-బోధన్ వరకు హైవేరోడ్డు నిర్మాణంలో భాగంగా అధికారులు మండల పరిధిలోని నాగాపూర్ గేటు సమీపంతో పాటు శాలిపేట, బూర్గుపల్లి, పోచమ్మరాళ్ వరకు ప్రమాదకరంగా మూల మలుపులు ఉన్నాయి. దీంతో రాత్రి వేళల్లో భారీ వాహనాలు అదుపుతప్పి అనేక ప్రమాదాలు జరిగిన ఎందరో ప్రాణాలు పోయాయి. కానీ ప్రస్తుతం అలాంటి ప్రమాదాలు జరగకుండా హైవే రోడ్డు నిర్మాణంలో క్రాసింగ్‌లు లేకుండా రోడ్డు నిర్మిస్తుండడంతో ఇక ప్రమాదాలు జరిగే అవకాశం లేకుండా నిర్మాణం చేపడుతున్నారు. అంతే కాకుండా పోచమ్మరాళ్ వద్ద కూడా గ్రామ పక్కన నుంచి గుట్టను చీల్చి మధ్యలో నుంచి రోడ్డు వేయడంతో ఈ ప్రాంతం నుంచి వెళ్లే వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా మారుతోంది. ముఖ్యంగా ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నారని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



శ్రీనివాస్(ఫైల్)

చిన్నశంకరం పేట(మెదక్): రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని రామాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. చిన్నశంకరంపేట పోలీస్‌ల కథనం మేరకు.. మండలంలోని రామాయపల్లి గ్రామానికి చెందిన అర్గొండ శ్రీనివాస్(28) పని మీద శుక్రవారం శాలిపేట వైపు వస్తుండగా సబ్‌స్టేషన్ మలుపు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని ఆదివారం పోస్ట్‌మార్టం నిర్వహించారు.

అనారోగ్యంతో పారిశుద్ధ్య కార్మికుడు మృతి



రాజు(ఫైల్)

హవేళిఘణాపూర్(మెదక్): అనారోగ్యంతో పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాల రాజు(35) పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం ఇంట్లో కుర్చీపై కూర్చున్న రాజు ఒక్కసారిగా కుప్పకూలి కిందపడి, చనిపోయాడని తెలిపారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజుకు వైద్యం చేయించుకునే స్థోమత లేకపోవడంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. గ్రామస్తులు చందాలు పోగు చేసి అంత్యక్రియలు చేశారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా గీతా మందిరం వార్షికోత్సవాలు

తూప్రాన్: డివిజన్ కేంద్రంలోని గీతా మందిరం 17వ వార్షికోత్సవాలు ఆదివారం గీతా భక్త సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం గణపతి పూజ, స్వస్తి వాచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, గోపాలస్వామికి అష్టోత్తర(108) శత కలశార్చన మహాభిషేకం, గణపతి, పంచాసూక్త హవనములు, రుక్మిణికృష్ణ కల్యాణం, అనంతరం మధవానంద స్వామి వారి అనుగ్రహభాషణం, భక్తులకు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కరాటేలో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): నర్సాపూర్‌లో జరిగిన కరాటే పోటీల్లో కాళ్లకల్‌కు చెందిన సన్‌షైన్ బుడోకాన్ స్పోర్ట్స్ ఆర్గనైజేషన్ విద్యార్థులు రాణించారు. ఈ కార్యక్రమంలో 115 మంది విద్యార్థులు వివిధ గ్రేడ్ బెల్టులను సాధించారు. ముఖ్య అతిథి మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, నియోజకవర్గ బీజేపీ నాయకుడు మురళీయాదవ్ బహుమతులు అందజేసినట్లు గ్రాండ్ మాస్టర్ మల్లేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్టర్లు లక్ష్మణ్, నాగరాజు, శ్రీకాంత్, నవీన్, అభిలాష్, బాబి, తరుణ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను ప్రశ్నించే అర్హత కాంగ్రెస్‌కు లేదు

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్: గజ్వేల్ అభివృద్ధి విషయంలో కేసీఆర్‌ను ప్రశ్నించే అర్హత స్థానిక కాంగ్రెస్ నాయకులకు లేదని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కృషి వల్ల నియోజకవర్గ దశదిశా మారిపోయిందని గుర్తు చేశారు. రైల్వే లైన్, రింగు రోడ్డు, ఎడ్యుకేషన్ హబ్, వంద పడకల ఆసుపత్రి, ములుగులో హార్టికల్చర్ యూనివర్శిటీ, ఫారెస్ట్రీ కళాశాలతోపాటు మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టారని గుర్తు చేశారు. ఇవే కాకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేశారని కొనియాడారు. ప్రస్తుతం గజ్వేల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం చేతకాక కేసీఆర్‌పై విమర్శలు గుప్పించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు నవాజ్ మీరా, చందు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఆదివారం నల్లపోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ ఆవరణలో గణపతి పూజ, పూర్ణాహుతి, అమ్మవారి అలంకరణ, అమ్మవారిని భక్తుల దర్శన అనంతరం కల్యాణోత్సవాన్ని వివిధ పండితుల మంత్రచ్ఛరణల మధ్య వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు అమ్మవారికి ఓడిబియ్యాన్ని పోసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరయ్యారు.

పగిలిన భగీరథ పైప్‌లైన్

పాపన్నపేట(మెదక్): కరెంట్ అధికారుల నిర్లక్ష్యం.. తాగు నీటికి ఇబ్బందిగా మారింది. స్థంభాలు నాటే క్రమంలో ముందు వెనక చూడకుండా విద్యుత్ కాంట్రాక్టర్ తవ్విన గొయ్యితో.. మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి పోయింది. దీంతో తాగునీరు వరదలై పారింది. మండలానికి రూ.35 లక్షల వ్యయంతో కొడిపల్లి నుంచి కొత్తగా 33 కేవీ విద్యుత్‌లైన్ వేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం యూసుఫ్‌పేట అంబేడ్కర్ విగ్రహం ముందు విద్యుత్ స్తంభం వేసేందుకు గొయ్యి తవ్వారు. అయితే దాని కిందనే ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి పోయి, విలువైన తాగునీరు వరదలై నేల పాలయ్యింది. దీంతో సోమవారం మండలంలోని చాలా గ్రామాలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇంత జరిగినా.. అధికారులెవరు సంఘటనా స్థలానికి కూడా రాలేదు.



యూసుఫ్‌పేట వద్ద పగిలిన భగీరథ పైప్‌లైన్

ఆలయాల్లో భక్తుల సందడి



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



కొడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవికి పూజలు చేస్తున్న భక్తులు



శివ్వంపేట(నర్సాపూర్):లక్ష్మీనర్సింహస్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారు. ఆదివారం ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ.. ఇందులో భాగంగా అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో..

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్, విఘ్నేశ్ నల్ల పోచమ్మకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి ఓడిబియ్యం పోసి కుంకుమార్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతోపాటు పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి వాహనాలకు పూజలు చేయించారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి, ఆలయ సిబ్బంది భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

కొనసాగుతున్న సికింద్లాపూర్ ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్‌గుప్తా, ప్రధాన అర్చకుడు ధనుంజయ్‌శర్మ, సిబ్బంది నర్సింహరెడ్డి, విద్యాకర్‌చారి, నరేష్‌చారి, తదితరులు ఉన్నారు.